తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం
సూర్యపేట
యాదాద్రి భువనగిరి
శుక్రవారం
12 జూన్ 2026
పేజీలు : 8
Follow :



# ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల




- పదో తరగతి ఫలితాల్లో వరుస విజయాలు..
- మినరల్ వాటర్ నుంచి క్రీడా మైదానం వరకు సకల సౌకర్యాలు..
- పలు గ్రామాల విద్యార్థులకు విజ్ఞాన నిలయం..
- ఉన్నత హోదాల్లో రాణిస్తున్న పూర్వ విద్యార్థులు..

**ఖమ్మం రూరల్, జూన్ 11(జనంసాక్షి):** గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలను మార్చేస్తూ ఖమ్మం రూరల్ మండలం లోని ఎం. వెంకటాయపాలెం గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తున్న ఉపాధ్యాయ బృందం, విద్యార్థులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలతో ఈ పాఠశాల నేడు ప్రైవేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని స్థాయికి చేరుకుంది. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గుచూపేవారు. అయితే ప్రస్తుతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాధిస్తున్న ఫలితాలు, విద్యార్థుల ప్రతిభ, పాఠశాలలో నెలకొన్న విద్యా వాతావరణం చూసి అనేక మంది తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. విద్యార్థులలో విద్యాపట్ల ఆసక్తి పెంపొందించడంతో పాటు వారి సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారు.

**పదో తరగతి ఫలితాల్లో అగ్రగామి**

ఇటీవల వెలువడిన పది ఫలితాలలో పరీక్ష రాసిన మొత్తం విద్యార్థులు సంఖ్య 38, పాసైనా విద్యార్థులు సంఖ్య 35 మంది విద్యార్థులు. 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 8 మంది వున్నారు. ప్రతి విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో ఈ పాఠశాల విశేష ప్రతిభ కనబరుస్తోంది. అత్యధిక ఉత్తీర్ణత శాతాన్ని నమోదు చేస్తూ మండల స్థాయిలో అగ్రగామిగా నిలుస్తోంది. కేవలం ఉత్తీర్ణతకే పరిమితం కాకుండా విద్యార్థులు మంచి మార్కులు సాధించి ఉన్నత విద్యకు బలమైన పునాది వేసుకుంటున్నారు. ప్రత్యేక తరగతులు, సందేహ నివృత్తి కార్యక్రమాలు, నిరంతర పర్యవేక్షణ ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థులను విజయపథంలో నడిపిస్తున్నారు.

**సౌకర్యాల్లోనూ ముందంజ**

ప్రభుత్వ పాఠశాల అంటే సౌకర్యాల లేమి అనే భావనకు ఈ పాఠశాల పూర్తిగా భిన్నంగా నిలుస్తోంది. పరిశుభ్రమైన తరగతి గదులు, స్వచ్ఛమైన వాతావరణం, విద్యార్థులకు మినరల్ వాటర్ సౌకర్యం, విశాలమైన క్రీడా మైదానం, పచ్చదనంతో నిండిన ప్రాంగణం వంటి సదుపాయాలు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. చదువుకు అనుకూలమైన వాతావరణం కల్పించడంలో పాఠశాల యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది.

**పలు గ్రామాల విద్యార్థులకు విద్యా కేంద్రం.**


ఎం. వెంకటాయపాలెం గ్రామంతో పాటు తనగంపాడు, గూడూరుపాడు, పిట్టలవారిగూడెం, పల్లెగూడెం, కాచిరాజుగూడెం, కాస్నాతండా, వాళ్యతండా, అరేకోడు తండా, రేగులతండా తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు ఈ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి కూడా విద్యార్థులు ఇక్కడికి రావడం పాఠశాలపై ఉన్న విశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తోంది.

**క్రీడల్లోనూ సత్తా చాటుతున్న విద్యార్థులు**

చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇస్తున్న ఈ పాఠశాల విద్యార్థులు మండల, జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. వివిధ క్రీడా విభాగాల్లో బహుమతులు సాధిస్తూ మిగతా 2లో

## చండూరు మండలంలో కాగితాలకే పరిమితమైన
# ఎమ్మెల్యే ఆదేశాలు..

- కేవలం హెచ్చరికల ప్రకటనలు.. క్షేత్రస్థాయిలో కనిపించే ఫలితాలు శూన్యం
- బెల్ట్ షాపు నిర్వాహకులకు,సరఫరా చేస్తున్న, వైన్స్
- షాపుల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి..
- బెల్ట్ షాపులకు మద్యం సరఫరా నిలిపివేస్తే బెల్ట్ షాపుల ఉనికే.. ఉండదు..
- వైన్ షాపుల నుండి అక్రమంగా గ్రామాల్లోకి మద్యం తరలుతోంది..?
- యువత మద్యానికి బానిసలై తమ బంగారు భవిష్యత్తు పాడు..
- ఇండ్లలో నిత్యం గొడవలతో మహిళలు కన్నీరు..
- మద్యం మహమ్మారి నుండి  గ్రామాలను కాపాడాలని  డిమాండ్..
- బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న ఎక్సైజ్ అధికారులు..




వార్తా లోపలి పేజీలో

# రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం



వార్తా లోపలి పేజీలో

- గుడిపల్లి మండలంలో ప్రభుత్వ సమీకృత కార్యాలయాలకు 15 కోట్ల నిధులు మంజూరు
- పి.ఏ.పల్లి కి 33/11కె వి సబ్ స్టేషన్ త్వరలో మంజూరు
- పూరి గుడిసెలో ఉంటున్న 216 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు
- దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్

# ఖరీఫ్ సాగులో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి:ఎమ్మెల్యే బత్తుల

**జనంసాక్షి, మిర్యాలగూడ :** ఖరీఫ్ సాగులో రైతులు ఇబ్బంది పడకుండా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం నాడు తన క్యాంపు కార్యాలయం లో నియోజకవర్గం లోని వ్యవసాయ అధికారులు, ప్రాథమిక సహకార సంఘాల సి ఈ ఓ ల తో ఖరీఫ్ సాగు పై సమీక్షా సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ సాగు కి సమాయత్తం అవుతున్నందున నియోజక వర్గం లో ఎంత విస్తీర్ణం లో సాగు చేస్తున్నారు అందుకు వారికీ అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, యూరియా అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. నకిలీ విత్తనాలు అమ్మే షాపుల వారిపై కేసులు నమోదు చెయ్యాలని అన్నారు. అధికారులు ఎప్పుడికప్పుడు పర్యవేక్షణ చేసి కృత్రిమ ఎరువుల కొరత సృష్టించే వారిపై కఠినంగా వ్యవహారించాలన్నారు. యూరియా యాప్ ను ఏ మండలానికి ఆ మండలం వేరువేరుగా నిర్వహించేలాగా, ఉదయం 6 గంటలకు తిరిగి సాయంత్రం6 గంటలకు అందుబాటులో కి తెచ్చేలాగా జిల్లా అధికారుల దృష్టికి, సంబంధిత మంత్రి గారి దృష్టికి తీసుకు వెళ్లాలని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, పి ఏ సి స్ఎస్ అధికారులు సమన్వయం తో పనిచేసి ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశ పెట్టె పథకాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమావేశం లో నియోజకవర్గం లోని వ్యవసాయ అధికారులు, పిఏసిఎస్ సి ఎ ఓ లు పాల్గొన్నారు.









పాఠశాల ఖ్యాతిని మరింత పెంచుతున్నారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ పెంపొందుతున్నాయి.

**స్ఫూర్తిగా నిలిచిన పూర్వ విద్యార్థులు**

ఈ పాఠశాలలో చదివిన అనేక మంది విద్యార్థులు నేడు ప్రభుత్వ శాఖలు, ప్రైవేట్ సంస్థలు, విద్యా రంగం, సాంకేతిక రంగాల్లో ఉన్నత హోదాల్లో కొనసాగుతున్నారు. తమ ప్రతిభతో సమాజంలో గుర్తింపు పొందిన వారు నేటి విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి కూడా ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని వారు నిరూపిస్తున్నారు.

**సమిష్టి కృషితో విజయగాథ**

పాఠశాల అభివృద్ధిలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల నిర్వహణ కమిటీ, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు అందరూ భాగస్వాములయ్యారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించడం వల్లే ఈ పాఠశాల నేడు మండలంలో ఆదర్శ విద్యాసంస్థగా ఎదిగింది.

ప్రభుత్వ పాఠశాలల్లో కూడా నాణ్యమైన విద్య అందించవచ్చని, సరైన ప్రణాళికతో విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చవచ్చని ఎం.వెంకటాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరోసారి నిరూపిస్తోంది. గ్రామీణ విద్యార్థుల కలలకు రెక్కలు తొడుగుతూ భవిష్యత్ తరాలను తీర్చిదిద్దుతున్న ఈ విద్యాలయం నిజంగా ప్రభుత్వ విద్యకు గర్వకారణంగా నిలుస్తోంది.

**ప్రభుత్వ పాఠశాల లోనే నాణ్యమైన విద్య.**

ప్రభుత్వ పాఠశాల లోనే నాణ్యమైన విద్య బోధన ఉంటుందని,ప్రతిభ కలిగిన ఉపాధ్యాయులు విద్యార్థులకు వారి మేధో శక్తికి అనుగుణంగా విద్య బోధన చేస్తారు.

**గుండమాల.శ్రీనివాసరావు..**
**ప్రధానోపాధ్యాయులు..**
**జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల..**





# అడవుల సంరక్షణ మనందరి బాధ్యత

## చౌటుప్పల్ రేంజ్ అటవీ శాఖ అధికారి జి.సత్యనారాయణ

**రామన్నపేట, జూన్ 11 (జనంసాక్షి):**
అడవులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చౌటుప్పల్ రేంజ్ అటవీశాఖ అధికారి జి.సత్యనారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక నర్సరీ వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పర్యావరణ పరిరక్షణ, అడవుల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.హరిత తెలంగాణ ? స్వచ్ఛమైన పర్యావరణం ? ఆరోగ్యకరమైన భవిష్యత్తు అనే నినాదంతో పర్యావరణం పై ప్రజలకు అవగాహన కల్పించారు.ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అనుమతులు లేకుండా చెట్లను నరికితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్స్ డి. రాగ్యానాయక్, ఎం గోవర్ధన్, రామన్నపేట గ్రామపంచాయతీ సెక్రెటరీ నరేష్, ఉప సర్పంచ్ మోటె రమేష్, కొమ్ము శేఖర్, గొరిగి శేఖర్, మోటె మహేష్, సుదర్శన్,అంజాద్,బీటీ ఆఫీసర్స్ కళ్యాణి, ప్రశాంతి,రవి,స్వాతి రాజశేఖర్ మరియు నర్సరీ సిబ్బంది పాల్గొన్నారు.

## చండూరు మండలంలో కాగితాలకే పరిమితమైన

# ఎమ్మెల్యే ఆదేశాలు..

**చండూరు, జూన్ 11 (జనంసాక్షి)**




మునుగోడు నియోజకవర్గం చండూరు మండల పరిధిలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పలుమార్లు ఇచ్చిన ఆదేశాలన్నీ కేవలం కాగితాలకే పరిమితమై పోతున్నాయని, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏమాత్రం మారలేదని చండూరు మండల ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.మండలంలోని గ్రామాల్లో నేడు బెల్ట్ షాపులు నిర్భయంగా, యథేచ్ఛగా నడుస్తున్నాయి. అసలు మద్యం సరఫరా వ్యవస్థే నిలిచిపోతే బెల్ట్ షాపుల ఉనికే ఉండదు. కానీ, వైన్స్ షాపుల నుండి అక్రమంగా గ్రామాల్లోకి మద్యం చేరవేస్తున్న 'అసలు' మూలాలపై, సరఫరాదారులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.మండలం లోని గ్రామాల్లో మద్యం ఏరులై పారుతుండటంతో ఎన్నో పేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. యువత మద్యానికి బానిసలై తమ బంగారు భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారు. ఇండ్లలో నిత్యం గొడవలతో మహిళలు కన్నీరు మున్నీరవుతున్నారు. ఒకవైపు ఇంత జరుగుతున్నా... తప్పు చేస్తున్న ప్రధాన సూత్రధారులను వదిలేసి, కేవలం పొట్టకూటి కోసం గ్రామాల్లో చిన్నపాటి వ్యాపారాలు చేసుకునే పేద ప్రజలపైనే చర్యలు తీసుకుంటామని అధికారులు పదేపదే ప్రకటనలు చేయడం బాధాకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బెల్ట్ షాపు నిర్వాహకుల కంటే, వారికి సరుకు సరఫరా చేస్తున్న పెద్దలపైనా, వైన్ షాపుల యాజమాన్యాలపైనా చర్యలు తీసుకోవాలి.వైన్ షాపుల నుంచి అనుమతి లేకుండా అంత పెద్ద మొత్తంలో మద్యం గ్రామాల్లోకి ఎలా తరలుతోంది..? ఎక్సైజ్, పోలీస్ అధికారుల నిఘా ఏమైందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.చండూరు మండల ప్రజలు స్థానిక ఎమ్మెల్యే ను ఒకటే విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలు కోరుకునేది కేవలం హెచ్చరికల ప్రకటనలు కాదు... క్షేత్రస్థాయిలో కనిపించే ఫలితాలు.బెల్ట్ షాపుల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించి, మద్యం అక్రమ రవాణా చేసే వారిపై, బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. సమస్య యొక్క మూలాలను (సరఫరా వ్యవస్థను) తుడిచిపెట్టినప్పుడే గ్రామాలు ప్రశాంతంగా మారతాయి.ఇప్పటికైనా అధికారులు,ప్రజాప్రతినిధులు స్పందించి మద్యం మహమ్మారి నుండి చండూరు మండల గ్రామాలను కాపాడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

**పి.ఏ.పల్లి /గుడిపల్లి,జూన్ 11(జనంసాక్షి ):**
గుడిపల్లి మండలంలో సమీకృత ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించడానికి గురువారం నాడు గుడిపల్లి మండలంలో దేవరకొండ శాసనసభ్యులు బాలునాయక్ స్థలాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా పత్రిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గుడిపల్లి మండలంలో ప్రభుత్వం కార్యకలాపాలు నిర్వహించడానికి ప్రభుత్వ కార్యాలయాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతుండ డంతో రాష్ట్ర ప్రభుత్వం సమీకృత కార్యాలయాలు నిర్మించడానికి 15 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్ తెలిపారు.ఈ సమీకృత కార్యాలయాలలో తహసిల్దార్, మండల ప్రజా పరిషత్,ఐకెపి, ఐసిడిఎస్,వ్యవసాయ, విద్యుత్తు మరియు ఇతర కార్యాలయాలు నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు.నాలుగున్నర ఎకరాలలో త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.గుడిపల్లి మండలంలో సమీకృత కార్యాలయాలు నిర్మించడానికి 15 కోట్లు మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క,జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని,నల్గొండ నుండి కొండమల్లేపల్లి,కొండమల్లేపల్లి నుండి డిండి కి డబుల్ రోడ్డు మంజూరు అయినట్లు తెలిపారు.పి.ఏ.పల్లి,గుడిపల్లి మండలాలలో ఆర్ అండ్ బి రోడ్లు,పంచాయతీరాజ్ శాఖ రోడ్ల సమస్యలు కూడా పూర్తి చేస్తామని ఆయన అన్నారు. గుడిపల్లి మండలాన్ని అందరి సహకారంతో మరింత అభివృద్ధి చేస్తానని ఆయన అన్నారు.పి.ఏ.పల్లి గ్రామానికి 33/11కేవీ సబ్ స్టేషన్ త్వరలో మంజూరు చేస్తామని ఆయన అన్నారు.వచ్చే సంవత్సరం చిలకమర్రి గ్రామానికి సబ్ స్టేషన్ మంజూరు చేస్తామని అన్నారు.గుడిపల్లి మండలంలో మార్నింగ్ వాక్ లో ఇచ్చిన హామీల మేరకు గుడిపల్లి గ్రామానికి 20 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అదే విధంగా 7బి డిస్ట్రిబ్యూటరీ కాలువ నుండి నీరు సరిగా వెళ్లకపోవడంతో కాల్వ పూడిక తీయడానికి 7 లక్షల నిధులు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చినట్లు ఆయన తెలిపారు.
అదేవిధంగా గతంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు డబ్బులు లేకపోవడంతో కొంతమంది రేకులు వేసుకున్నారని అలాంటి వారికి ప్రభుత్వం మరొకసారి అవకాశం ఇస్తూ లబ్ధిదారుడు స్లాబ్ వేసుకుంటే రెండు లక్షల రూపాయలు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు.దేవరకొండ నియోజకవర్గం లో 216 మంది పూరి గుడిసెలో ఉంటున్నారని 216 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.బిఆర్ఎస్ పార్టీ,బిజెపి పార్టీ నాయకులు వరి ధాన్యం కొనడం లేదని ధర్నాలు చేశారని,బిఆర్ఎస్ ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న జీతభత్యాలు తీసుకుంటూ కనీసం రైతుల గురించి పట్టించుకోకుండా కేవలం ఫామ్ హౌస్ కే పరిమితమయ్యాడని ఆయన ఎద్దేవా చేశారు.కేంద్ర ప్రభుత్వం వరి ధాన్యం కొనడం లేదని,భారత దేశంలో తెలంగాణ రాష్ట్రం మాత్రమే అత్యధికంగా వరి ధాన్యం కొంటున్నదని అన్నారు. దేవరకొండ నియోజకవర్గం లో 1,35,456 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొన్నామని ఆయన అన్నారు.బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో ప్రభుత్వ ఖజానాను లూటీ చేశారని,వారు చేసిన అప్పులు తీర్చుకుంటూ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నామని ఆయన అన్నారు.ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటవ తారీఖు నాడు జీతాలు ఇస్తున్నామని, అదే విధంగా పెన్షన్ దారులకు గత ప్రభుత్వ హాయంలో 6000 కోట్లు పెండింగ్ ఉండగా మా ప్రభుత్వం హయాంలో 2000 కోట్లు చెల్లించామని అన్నారు.సన్నరకం దాన్యం పండించిన రైతులకు 500 రూపాయల బోనస్ మరియు గిట్టుబాటు ధర కూడా ఇస్తున్నామని ఆయన అన్నారు.
పి.ఏ.పల్లి,గుడిపల్లి మండలాల్లో ధాన్యం కొనుగోలులో కీలకపాత్ర వహించిన ప్రతి అధికారికి, మిల్లర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల పట్ల,విద్య పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరబోయిన ఎల్లయ్య యాదవ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగాల ప్రతాప్ రెడ్డి,ఏ.వి.రెడ్డి,తేరా సత్యనారాయణ రెడ్డి,కుక్కల గోవర్ధన్ రెడ్డి,నెర్మటి సతీష్ రెడ్డి, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,ముచ్చర్ల ఏడుకొండల యాదవ్,ముచ్చర్ల శ్రీకాంత్ యాదవ్,బోడియా నాయక్, గుడిపల్లి మాజీ సర్పంచ్ శీలం శేఖర్ రెడ్డి,సింగరాజుపల్లి సర్పంచ్ శ్రీను,వంగాల వెంకట్ రెడ్డి,వడ్లపల్లి చంద్రారెడ్డి,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు : ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

## కొండమల్లేపల్లి మండలంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే బాలు నాయక్



**కొండమల్లేపల్లి, జూన్ 11 (జనంసాక్షి):**
కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. కొండమల్లేపల్లి మండలంలో ఎమ్మెల్యే బాలు నాయక్ గురువారం అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులతో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. కొండమల్లేపల్లి గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు ఏర్పాటు చేసిన రెండు చెత్త సేకరణ ఆటోలను ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గ్రామాల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు స్థానిక సంస్థలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఆహార ధాన్యాల నిల్వ భవనానికి శంకుస్థాపన చేశారు. రైతులు పండించిన ధాన్యాన్ని భద్రంగా నిల్వ ఉంచేందుకు ఈ భవనం ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత మరింత మెరుగుపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం మండల పరిధిలోని దంజిలాల్ తండా గ్రామపంచాయతీలో త్రాగునీటి సమస్య పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన నూతన బోరును, అలాగే గ్రామ ప్రజల సౌకర్యార్థం కోసం 5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం రామావత్ మౌనిక శ్రీకాంత్ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా గన్యానాయక్ తండా గ్రామపంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన మూడు ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు అభినందనలు తెలిపారు. పేద కుటుంబాలు గౌరవప్రదమైన జీవనం గడపాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఎన్నికలలో ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తామని ప్రజాప్రభుత్వంలో ప్రజలకు అవసరమయ్యే అన్ని పనులు పూర్తి చేస్తామన్నారు. గ్రామాలలో మౌలిక వసతులైన మంచినీళ్లు, విద్యుత్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, సిసి రోడ్లు పనులు త్వరలో అన్ని గ్రామాలలో పూర్తి చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు అర్హత ఉండ ఇండ్లు రాని వాళ్లకు మరో విడతలో ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, పిఆర్ డిఈ లింగారెడ్డి, తహసిల్దార్ నరేందర్, ఎంపిడిఓ స్వర్ణలత, పిఆర్ ఏఈ ఇందిర, హౌసింగ్ ఏఈ కుమార్, ఎంపిఓ సుధీర్ కుమార్, మాజీ ఎంపిపిలు దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి, మేకల శ్రీనివాస్ యాదవ్, మాజీ పిఎసిఎస్ చైర్మన్ డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి, దేవరకొండ మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఉట్కూరి వేమన్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బొడ్డుపల్లి సైదులు, మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, సర్పంచులు పసునూరి యుగేందర్ రెడ్డి, రమావత్ రాము, రమావత్ ఘోజీ, రమావత్ రాజు, రమావత్ సేవానాయక్, రమావత్ సుక్య నాయక్, ఉప సర్పంచ్ కొడిదల పద్మ వెంకటయ్య, పెద్దశెట్టి సుధాకర్, గంధం సురేష్, అబ్బనబోయిన శ్రీనివాస్ యాదవ్, రమావత్ దంజిలాల్ నాయక్, భీమ్ సింగ్, జగన్ నాయక్, లాలు నాయక్, తుకారాం, పంచాయతీ సెక్రటరీలు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పిద్దాం విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేద్దాం ..

**కనగల్లు, జూన్ 11 (జనంసాక్షి)**
ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పిద్దాం విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేద్దామని ఎం గౌరారం ఉపసర్పంచ్ బీరెల్లి నాగరాజు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎం గౌరారం తుర్కపల్లి తదితర గ్రామాలలో గురువారం విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు అవగాహన ర్యాలీని నిర్వహించారు. అధిక పీజులు వసూలు చేసే ప్రైవేటు పాఠశాలలకు స్వస్తి పలికి అనుభవంతో కూడిన ఉపాధ్యాయులు అన్ని వసతులతో ఉన్న ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య బోధనజరుగుతున్నందున విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలోనే చేరి విద్యనభ్సించాలని సూచించారు. ప్రభుత్వం అందించే ఉచిత నోటు పుస్తకాలు, యూనిఫామ్స్, బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనం లాంటి సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కనగల్ వ్యాయామ ఉపాధ్యాయుడు కుంభం నర్సిరెడ్డి, ఉపాధ్యాయులు ఆరూరు జానయ్య, ఏ రాజా, బండ సురేష్ రెడ్డి, పాఠశాల పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలి



**వలిగొండ,జున్ 11 (జనంసాక్షి)**
మండలంలోనిప్రధానోపాధ్యాయులకు, మధ్యాహ్న భోజన ఏజెన్సీ సిబ్బందికి స్థానిక శ్రీ వెంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈనెల 15 నుండి పాఠశాల ప్రారంభం అవుతున్నందున విద్యార్థులకు అందజేసే మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశుభ్రత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేయడం జరిగింది. ఎలాంటి ఇబ్బంది లేకుండా మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారంగా విద్యార్థులకు అందజేయాలని రాష్ట్ర విద్యాశాఖ ఇచ్చే సూచనలు పాటిస్తూ విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించడంతోపాటు వంట పాత్రలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నాణ్యమైన మెటీరియల్ ఉపయోగించాలని బియ్యం యొక్క నాణ్యత ఉండేటప్పుడు పరిశుభ్రతను పాటించాలని తెలియజేయడం జరిగింది. ఈ సమావేశంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# పొగాకు రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి




**యాదాద్రి, కరస్పాండెంట్ జూన్ 11 (జనం సాక్షి)**
యాదాద్రి భువనగిరి జిల్లాను పొగాకు రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్, ఐడీఓసీ, రాయగిరి, భువనగిరిలో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మే 31న నిర్వహించే ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లాలో అన్ని శాఖల సమన్వయంతో విస్తృత స్థాయిలో అవగాహన, అమలు మరియు తనిఖీ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో సిఓటిపిఏ చట్టం?2003 నిబంధనలను కఠినంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పోలీస్, మున్సిపల్, విద్య మరియు వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ప్రజా ప్రదేశాలు, బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు మరియు విద్యాసంస్థల పరిసరాల్లో చట్ట ఉల్లంఘనలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యాసంస్థలకు 100 గజాల పరిధిలో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న దుకాణాలను గుర్తించి, విద్యాశాఖ, పోలీస్ శాఖ, మున్సిపల్ శాఖ, పంచాయతీ రాజ్ శాఖ, స్వచ్ఛంద సంస్థలు మరియు వైద్య ఆరోగ్య శాఖల సమన్వయంతో తొలగించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులను పొగాకు వ్యసనానికి దూరంగా ఉంచేందుకు సంబంధిత శాఖలు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. అలాగే జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలను పొగాకు రహిత విద్యాసంస్థలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, నిషేధ బోర్డులు ఏర్పాటు చేయడం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం మరియు మార్గదర్శకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ జిల్లాలో పొగాకు వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ర్యాలీలు, వాక్థాన్‌లు, ఐఈసీ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే పొగాకు వ్యసన నిర్మూలన మరియు మానసిక ఆరోగ్య సేవలకు సంబంధించిన టెలి-మానస్ హెల్ప్‌లైన్ 14416 మరియు జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం ద్వారా అందుబాటులో ఉన్న సేవలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ, జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. ఎం. మనోహర్, జిల్లా అగ్నిమాపక అధికారి మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ అడ్మిషన్ల కొరకు దరఖాస్తుల ఆహ్వానం

**సూర్యాపేట(జనంసాక్షి):**
సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలోని బాలెంలలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో
2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్స్ కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నీల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో బీఏ(హిస్టరీ,ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్), బీకాం(జనరల్), బీఎస్సీ( మ్యాథ్స్,ఫిజిక్స్, కెమిస్ట్రీ), బీఎస్సీ (మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, డాటా సైన్స్), బీఎస్సీ(బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ), బీఎస్సీ(మైక్రో బయాలజీ, జువాలజీ, కెమిస్ట్రీ) గ్రూపులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థినిలు సంబంధిత సర్టిఫికెట్స్ తో కళాశాలలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అడ్మిషన్స్ కొరకు సంప్రదించవచ్చని తెలిపారు. టీసీ, ఎస్ఎస్సీ మెమో, ఇంటర్మీడియట్ షార్ట్ మెమో, బోనఫైడ్ సర్టిఫికెట్స్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డ్, ఐదు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, దోస్త్ ఐడితో ఆసక్తిగల విద్యార్థినిలు కళాశాలలో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 7995010681లో సంప్రదించవచ్చని తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

**○వ్యవసాయంలో రసాయనాల వాడకాన్ని తగ్గించాలి ○జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి టి. నాగిరెడ్డి**

**యాదాద్రి, కరస్పాండెంట్ జూన్ 11 (జనంసాక్షి):** పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ప్రతీ ఒక్కరు బాధ్యతగా భావించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి టి. నాగిరెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆక్షన్ ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వెటర్నరీ శాఖ మీటింగ్ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో డిఆర్డీవో టి నాగిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పీవీ రమణారెడ్డి, జిల్లా వెటర్నరీ అండ్ అనిమల్ అస్బెండరీ అధికారి డాక్టర్ కె. రమేష్ లు మాట్లాడుతూ వ్యవసాయరంగంలో రసాయనాలను క్రమంగా తగ్గించి సేంద్రీయ ఎరువులు వాడటం చేయడం అవసరమని అన్నారు. రోజు రోజుకు ప్లాస్టిక్ వాడకం పెరిగిపోవడం బాధాకరమని ప్లాస్టిక్ సంచులు, కవర్లు వాడిన తర్వాత గడ్డిలో వేయడం వల్ల పశువులు, మూగ జీవాలు తినడం వల్ల వాటి ప్రాణాలకు ముప్పుగా పరిణమిస్తుంది అని అన్నారు. ముఖ్యంగా రసాయనాల నియంత్రణ, ప్లాస్టిక్ వాడకాన్ని



తగ్గించడం ప్రతీ ఒక్కరు భాధ్యతగా తీసుకోవాలని అన్నారు. ఆక్షన్ ఎయిడ్ ప్రోగ్రామ్ లీడ్ డాక్టర్ ఇర్ఫాన్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వల్ల ముఖ్యంగా వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం ఉంటుందని తద్వారా ఆహార భద్రతకు ముప్పు వాటిల్లుతుందని అన్నారు. పర్యావరణ మార్పుల వల్ల భూమి వేడేక్కడం, భూగర్భ జలాలు అడుగంటడం, అడవులు క్రమంగా తగ్గిపోవడం వంటి పరిస్థితులను చూస్తున్నామని భవిష్యత్ చాల ప్రమాదకరంగా ఉంటుందని ఇందుకోసం ప్రతిఒక్కరు సామాజిక భాద్యతగా పర్యావరణాన్ని ప్రకృతిని కాపాడుకోవాలని అన్నారు. ఇందు కోసం ఆక్షన్ఎయిడ్ పని చేస్తున్న ప్రాంతాలలో గ్రామ స్థాయి నుండి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి హ్యూమన్ రైట్స్ డిఫెండర్ సురుపంగ శివలింగం, ఎల్ఆర్పీ ప్రతినిధులు, వివిధ సంస్థల నాయకులు బట్టు రామచంద్రయ్య, కె. శ్రీశైలం, వినోద్, ఎల్ఆర్పీ ప్రతినిధులు జె. కవిత. టి. చంద్రకళ, అనూష, శిరీష తదితరులు పాల్గొన్నారు.

# గుర్రంపోడు మోడల్ కళాశాల ఘన విజయం

❑ ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో విద్యార్థుల హవా

❑ సెకండియర్‌లో 100%, ఫస్టియర్‌లో 94 శాతం

**ఉత్తీర్ణతఇంప్రూవ్మెంట్‌లో మార్కుల వర్షం కురిపించిన టాపర్లు**

**గుర్రంపోడు , జూన్ 11, (జనంసాక్షి)** గుర్రంపోడు మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర మోడల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ, ఇంప్రూవ్మెంట్ ఫలితాల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 23 మందికి 22 మంది ఉత్తీర్ణులై 94 శాతం, ద్వితీయ సంవత్సరంలో



ఐదుగురికి ఐదుగురు ఉత్తీర్ణులై 100 శాతం అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి. రాగిణి తెలిపారు.ప్రథమ సంవత్సరం ఇంప్రూవ్మెంట్‌లోనూ విద్యార్థులు మార్కుల వర్షం కురిపించారు. ఎంపీసీ గ్రూపులో ప్రేమగీత (464/470), బైపీసీలో సింధు (423/440), సీఈసీలో మహేశ్వరి (406/500) మార్కులతో అత్యధిక స్కోరు సాధించి టాప్‌గా నిలిచారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన విద్యార్థులను, వారిని తీర్చిదిద్దిన అధ్యాపక బృందాన్ని ప్రిన్సిపాల్ రాగిణి ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ కళాశాల ప్రతిష్టను పెంచుతున్నామని, ఇందుకు సహకరించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలని ఆమె పేర్కొన్నారు.

# రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం..

**నియోజకవర్గంలో 216 మందికి ఇందిరమ్మ ఇండ్లు: ఎమ్మెల్యే బాలు నాయక్**



❑గుడిపల్లి మండలంలో ప్రభుత్వ సమీకృత కార్యాలయాలకు 15 కోట్ల నిధులు మంజూరు

❑రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం -పి.ఏ.పల్లి కి 33/11కె వి సబ్ స్టేషన్ త్వరలో మంజూరు


❑పూరి గుడిసెలో ఉంటున్న 216 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు

❑ దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్

**పి.ఏ.పల్లి /గుడిపల్లి,జూన్ 11(జనంసాక్షి ):** గుడిపల్లి మండలంలో సమీకృత ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించడానికి గురువారం నాడు గుడిపల్లి మండలంలో దేవరకొండ శాసనసభ్యులు బాలునాయక్ స్థలాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా పత్రిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గుడిపల్లి మండలంలో ప్రభుత్వం కార్యకలాపాలు నిర్వహించడానికి ప్రభుత్వ కార్యాలయాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతుండ డంతో రాష్ట్ర ప్రభుత్వం సమీకృత కార్యాలయాలు నిర్మించడానికి 15 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్ తెలిపారు.ఈ సమీకృత కార్యాలయాలలో తహసిల్దార్, మండల ప్రజా పరిషత్,ఐకెపి, ఐసిడిఎస్,వ్యవసాయ, విద్యుత్తు మరియు ఇతర కార్యాలయాలు నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు.నాలుగున్నర ఎకరాలలో త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.గుడిపల్లి మండలంలో సమీకృత కార్యాలయాలు నిర్మించడానికి 15 కోట్లు మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క,జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని,నల్గొండ నుండి కొండమల్లేపల్లి,కొండమల్లేపల్లి నుండి డిండి కి డబుల్ రోడ్డు మంజూరు అయినట్లు తెలిపారు.పి.ఏ.పల్లి,గుడిపల్లి మండలాలలో ఆర్ అండ్ బి రోడ్లు,పంచాయతీరాజ్ శాఖ రోడ్ల సమస్యలు కూడా పూర్తి చేస్తామని ఆయన అన్నారు. గుడిపల్లి మండలాన్ని అందరి సహకారంతో మరింత అభివృద్ధి చేస్తానని ఆయన అన్నారు.పి.ఏ.పల్లి గ్రామానికి 33/11కేవీ సబ్ స్టేషన్ త్వరలో మంజూరు చేస్తామని ఆయన అన్నారు.వచ్చే సంవత్సరం చిలకమర్రి గ్రామానికి



సబ్ స్టేషన్ మంజూరు చేస్తామని అన్నారు.గుడిపల్లి మండలంలో మార్నింగ్ వాక్ లో ఇచ్చిన హామీల మేరకు గుడిపల్లి గ్రామానికి 20 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అదే విధంగా 7బి డిస్ట్రిబ్యూటరీ కాలువ నుండి నీరు సరిగా వెళ్లకపోవడంతో కాల్వ పూడిక తీయడానికి 7 లక్షల నిధులు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చినట్లు ఆయన తెలిపారు.అదేవిధంగా



GOVERNMENT OF TELANGANA
ABSTRACT

TRANSPORT, ROADS AND BUILDINGS (BUILDINGS) DEPARTMENT

ORDER:

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)

SPECIAL CHIEF SECRETARY TO GOVERNMENT

//FORWARDED :: BY ORDER//

SECTION OFFICER

గతంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు డబ్బులు లేకపోవడంతో కొంతమంది రేకులు వేసుకున్నారని అలాంటి వారికి ప్రభుత్వం మరొకసారి అవకాశం ఇస్తూ లబ్ధిదారుడు స్లాబ్ వేసుకుంటే రెండు లక్షల రూపాయలు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. దేవరకొండ నియోజకవర్గం లో 216 మంది పూరి గుడిసెలో ఉంటున్నారని 216 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.బిఆర్ఎస్ పార్టీ,బిజెపి పార్టీ నాయకులు వరి ధాన్యం కొనడం లేదని ధర్నాలు చేశారని,బిఆర్ఎస్ ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న జీతభత్యాలు తీసుకుంటూ కనీసం రైతుల గురించి పట్టించుకోకుండా కేవలం ఫామ్ హౌస్ కే పరిమితమయ్యాడని ఆయన ఎద్దేవా చేశారు.కేంద్ర ప్రభుత్వం వరి ధాన్యం కొనడం లేదని,భారత దేశంలో తెలంగాణ రాష్ట్రం మాత్రమే అత్యధికంగా వరి ధాన్యం కొంటున్నదని అన్నారు. దేవరకొండ నియోజకవర్గం లో 1,35,456 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొన్నామని ఆయన అన్నారు.బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో ప్రభుత్వ ఖజానాను లూటీ చేశారని,వారు చేసిన అప్పులు తీర్చుకుంటూ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నామని ఆయన అన్నారు.ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటవ తారీఖు నాడు జీతాలు ఇస్తున్నామని, అదే విధంగా పెన్షన్ దారులకు గత ప్రభుత్వ హాయంలో 6000 కోట్లు పెండింగ్ ఉండగా మా ప్రభుత్వం హయాంలో 2000 కోట్లు చెల్లించామని అన్నారు.సన్నరకం దాన్యం పండించిన రైతులకు 500 రూపాయల బోనస్ మరియు గిట్టుబాటు ధర కూడా ఇస్తున్నామని ఆయన అన్నారు. పి.ఏ.పల్లి,గుడిపల్లి మండలాల్లో ధాన్యం కొనుగోలులో కీలకపాత్ర వహించిన ప్రతి అధికారికి, మిల్లర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల పట్ల,విద్య పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరబోయిన ఎల్లయ్య యాదవ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగాల ప్రతాప్ రెడ్డి,ఏ.వి.రెడ్డి,తేరా సత్యనారాయణ రెడ్డి,కుక్కల గోవర్ధన్ రెడ్డి,నెర్మటి సతీష్ రెడ్డి, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,ముచ్చర్ల ఏడుకొండల యాదవ్,ముచ్చర్ల శ్రీకాంత్ యాదవ్,బోడియా నాయక్, గుడిపల్లి మాజీ సర్పంచ్ శీలం శేఖర్ రెడ్డి,సింగరాజుపల్లి సర్పంచ్ శ్రీను,వంగాల వెంకట్ రెడ్డి,వడ్లపల్లి చంద్రారెడ్డి,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళన కరపత్రం ఆవిష్కరణ



ఖమ్మం కార్పొరేషన్, జూన్ 11 (జనంసాక్షి) ఈనెల 21న హైదరాబాద్ ఇందిరా పార్క్ దగ్గర జరిగే తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనం కరపత్రాన్ని తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం రిజిస్టర్డ్ రాష్ట్ర కార్యదర్శి, చిన్నారి హాస్పిటల్ అధినేత కే వి కృష్ణారావు తో కలిసి తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పిడమర్తి రవి ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం, గృహ నిర్మాణం కోసం 10 లక్షల రూపాయలు ,25 వేల పెన్షన్ ,మరియు గౌరవం కోసం జరిగే ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు నక్క మహేష్, చందర్ నాయక్, మిసాల మహేష్ పాల్గొన్నారు.

## తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడుగా తన్నీరు క్రిష్ణార్జునరావు



కల్లూరుజూన్ 11(జనంసాక్షి) ముదిగొండ మండలం వెంకటాపురం గ్రామంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం 25 జిల్లా మహసభ లో కల్లూరు పట్టణానికి చెందిన సిపిఎం నాయకులు తన్నీరు కృష్ణార్జునరావ్ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైనారు. గురువారం కల్లూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతు వ్యవసాయ కార్మికులసమస్య లపై ,ఉపాధి హామీ పథకం యధావిధిగా కొనసాగించేలా ,ప్రతి పేదకుటుంబానికి ఇల్లు ఇచ్చేలా పోరాటాలు చేస్తామని తెలిపారు.,పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని,ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని,పేదలకు ఇళ్లు,ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ,కూలి రేట్లు పెంపుకోసం పోరాటం చేస్తామని చెప్పారు.

## ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల సత్తా

●ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో 90 శాతానికి పైగా ఉత్తీర్ణత ●నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సౌకర్యాలు



తిరుమలాయపాలెం, జూన్ 11 (జనంసాక్షి): గురువారం విడుదలైన ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో 90 శాతానికి పైగా ఉత్తీర్ణత సాధించి కళాశాల మరోసారి తన విద్యా ప్రమాణాలను చాటుకుంది.ద్వితీయ సంవత్సరంలో మొత్తం 134 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, వారిలో 123 మంది ఉత్తీర్ణత సాధించి 91 శాతం ఫలితాన్ని నమోదు చేశారు. అలాగే ప్రథమ సంవత్సరంలో 125 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 114 మంది ఉత్తీర్ణత సాధించి 92 శాతం ఉత్తీర్ణత శాతాన్ని సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ రామకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థుల కృషి, అధ్యాపకుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారంతోనే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక బృందాన్ని అభినందించారు.మండలంలో ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన సుమారు 450 మంది విద్యార్థుల్లో ఇప్పటికే 80 మంది పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందినట్లు తెలిపారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు. కళాశాలలో నాలుగు డిజిటల్ ప్యానెల్ బోర్డులతో స్మార్ట్ క్లాస్‌రూమ్ బోధన, శుద్ధమైన తాగునీటి కోసం ఆర్.ఓ. వాటర్ ప్లాంట్, మధ్యాహ్న భోజన పథకం, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉపకార వేతనాలు, క్రీడా సౌకర్యాలు మరియు పలు విద్యా?సంక్షేమ కార్యక్రమాలు విద్యార్థులకు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ విలువైన అవకాశాలను సద్వినియోగం చేసుకుని మండలంలోని పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులందరూ పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు పొందాలని ప్రిన్సిపాల్ పిలుపునిచ్చారు. ఇప్పటికే ప్రథమ, ద్వితీయ సంవత్సర తరగతులు ప్రారంభమైనందున విద్యార్థులు ఆలస్యం చేయకుండా వెంటనే ప్రవేశాలు పొందాలని సూచించారు.

## ఆచార్య జయశంకర్ బడిబాట విస్తృత ప్రచారం

చందూరు, జూన్ - 11 (జనంసాక్షి) చందూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గురువారం ఆచార్య జయశంకర్ బడిబాట ప్రచారం విస్తృతంగా చేస్తున్నారు. 2026–27 ఈ విద్యా సంవత్సరం చందూరు హైస్కూల్ తెలంగాణ పబ్లిక్ స్కూల్ గా మారుతున్న విషయాన్ని ప్రధానంగా ప్రచారం చేస్తూ... వాడవాడలో ఇంటింటికి తిరుగుతున్నారు. హై స్కూల్ సిబ్బందిలో స్థానిక ఉపాధ్యాయులే ఎక్కువగా ఉండటం విశేషం. ఈ కార్యక్రమంలో బొమ్మరిపోయిన చందు, పందుల యాదగిరి, బావండ్ల వీరేశం, రాపోలు యాదగిరి, గంట వెంకటేశం, కుడికిల్ల శ్రీను, కల్లెం వెంకటరెడ్డి, కరుణాకర్ రెడ్డి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## హాలియా క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు అల్పాహారం వితరణ

హాలియా జనం సాక్షి జూన్ 11 హాలియా క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు అల్పాహారం అందజేయడం అభినందనీయమని అనుముల మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పోలా సైదులు అన్నారు గురువారం నాడు హాలియాలో అల్పాహారం దాత ఊరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో 500 మందికి అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా పోలా సైదులు మాట్లాడుతూ ఊరు శ్రీకాంత్ సేవలు అభినందనీయమని ప్రతిరోజు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఊరు శ్రీకాంతును ఘనంగా సన్మానించారు,హాలియా క్లబ్ అధ్యక్షులు పొత్తు ముట్టు వెంకటేష్ గుప్తా మాట్లాడుతూ సేవే మా లక్ష్యం అన్న నినాదంతో సంపాదించిన రూపాలలో వన్ పర్సెంట్ సేవ కు ఖర్చు చేయాల అని ఏర్పాటు చేసిన ఈ సేవా కార్యక్రమానికి సహకరిస్తున్న ప్రతి ఒక్క దాతలకు సభ్యులకి మా యొక్క కమిటీ తరఫున ధన్యవాదాలు తెలియజేసుకుంటూ ముందు ముందు అందరి సహాయ సహకారంతో మరెన్నో సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తామని వారు తెలిపారు ఈ తెలియజేశారు ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు బచ్చు సతీష్ కుక్కడ పు సంతోష్ హాకీ నాగరాజ్ పోలిశెట్టి మహేష్ తేలపోలు ఉదయ్ ఊరే వినోద్ ఇక్కడకు సముద్రాల అరవింద్ బచ్చు వెంకన్న సైదయ్య రవీందర్ మొగులయ్య బన్నీ ఆర్యవైశ్య మండల అధ్యక్షులు పోలా సైదులు పట్టణ అధ్యక్షులు మంచు కొండ ప్రభాకర్ తేలప్రోలు శేఖర్ మంచి కొండ వెంకటేశ్వర్లు ది కిరాణం జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు చిట్టిప్రోలు శ్రీనివాస్ కొండూరు వెంకటేశ్వర్లు చిట్టిప్రోలు రంజిత్ కట్ట మనోహర్ కుంచకూరి ప్రభాకర్ మంచుకొండ శీను పొట్టు పొత్తు అంజయ్య మిర్యాల గోపి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# జీవ వైవిధ్య పరిరక్షణ కు భవిష్యత్ కార్యాచరణ

❑ అటవీ శాఖ సహకారంతో.. ఐటీసీ నిర్వహణలో ప్రజా పాలన ❑ ప్రగతి ప్రణాళిక







బూర్గంపహాడ్ జూన్ 11 (జనంసాక్షి) సుస్థిర అభివృద్ధి, సహజ వనరుల నిర్వహణ, జీవ వైవిధ్య పరిరక్షణ, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై చర్చించేందుకు ఐటీసీ మిషన్ సునేహ్రా కల్ (ఎం ఎస్ కె) అటవీ శాఖ సహకారంతో ప్రజా పాలన ? ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి (డి ఎఫ్ ఓ) కిష్టా గౌడ్, అటవీ విభాగ అధికారి (ఎఫ్ డి ఓ) బాబు ఆర్, ఐటీసీ యూనిట్ హెడ్ – వైస్ ప్రెసిడెంట్ శైలేందర్ సింగ్, ఐటీసీ జీఎం- హెచ్‌ఆర్ శ్యామ్ కిరణ్, డీజీఎం చెంగల్ రావు, మిషన్ సునేహ్రా కల్ (ఎం ఎస్ కె) ప్రతినిధులు గీత ప్రవల్లిక, కుంటల్ సర్కార్, ఎన్‌జీఓ భాగస్వాములు, అటవీ రేంజ్ అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ఐటీసీ మిషన్ సునేహ్రా కల్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ఐటీసీ ప్రతినిధులు ప్రదర్శించారు. సామాజిక అటవీకరణ, సుస్థిర వ్యవసాయ పద్ధతులు, అటవీ, సామూహిక భూముల జీవ వైవిధ్య పరిరక్షణ, రైతుల జీవనోపాధి అభివృద్ధి, ప్రాథమిక విద్య, మహిళా సాధికారత, ఆరోగ్యం, పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, గ్రామీణ యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ వంటి అంశాలను వివరించారు. జిల్లా అటవీ అధికారి కిష్టా గౌడ్ మాట్లాడుతూ అటవీ వైవిధ్యీకరణ, పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. భవిష్యత్ తరాల కోసం సహజ వనరులను కాపాడటం, పచ్చదనాన్ని పెంపొందిం చడం, వన్యప్రాణుల ఆవాసాలను రక్షించడం కోసం సమిష్టి కృషి అవసరమని ఆయన అన్నారు. పర్యా వరణ పరిరక్షణ కార్యక్రమాలలో ప్రజల భాగస్వా మ్యాన్ని మరింత పెంచాలని ఆయన సూచించారు. అనంతరం అటవీ విభాగ అధికారి బాబు ఆర్. మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగస్వామ్య సంస్థల పాత్ర ఎంతో కీలకమన్నారు. పర్యావరణ పరిరక్షణ, గ్రామీణాభివృద్ధి రంగాల్లో ఐటీసీ, దాని భాగస్వామ్య సంస్థలు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. అటవీ సంరక్షణ, నీటి వనరుల పరిరక్షణ, సహజ వనరుల ఆధారిత జీవనోపాధులపై గ్రామీణ ప్రజల్లో అవగాహన పెంపొందించడం అవసరమని ఆయన తెలిపారు. కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ పట్ల ఐటీసీ చూపుతున్న నిబద్ధతను ప్రశంసించారు. జీవ వైవిధ్య పరిరక్షణ, మెరుగైన జీవనోపాధులు, గ్రామీణాభివృద్ధి సాధనలో ఐటీసీ, అటవీ శాఖ, స్థానిక సమాజాల మధ్య సమన్వయంతో కూడిన కృషి కొనసాగాలని వారు సూచించారు. జీవ వైవిధ్య పరిరక్షణ, పర్యావరణ సుస్థిరత, మెరుగైన జీవనోపాధులు, సమగ్ర గ్రామీణాభివృద్ధికి తోడ్పడే కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలనే సంకల్పంతో కార్యక్రమాన్ని ముగించారు.

## కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ




**కల్లూరుజూన్ 11(జనంసాక్షి)**
కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగాసరఫరాచేసినఇంటర్మీడియట్ పాఠ్య పుస్తకాలను ముఖ్య అతిథులుగా హాజరైన మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ , కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుమర్తి చందర్రావు కళాశాల ప్రిన్సిపాల్ వేముల శేఖర్ అధ్యాపకులు, పలువురు కౌన్సిలర్లతో కలిసి గురువారం విద్యార్థులకు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు ఎంతో దోహదపడతాయని, విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మున్సిపాలిటీ కౌన్సిలర్లు దాసరి సుధారాణి ఉబ్బన రాంబాబు , రిటైర్డ్ ఆర్ సి ఓ మేకతోటి పుల్లయ్య, కళాశాల అధ్యాపకులు, కాంగ్రెస్ నాయకులు శీలం కృష్ణారెడ్డి, యాసా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




## ఇంటర్ సప్లిమెంటరీలో స్టెమ్‌స్పార్క్ విద్యార్థుల ప్రతిభ

**ఖమ్మం, (జనంసాక్షి) :**
ఖమ్మం నగరంలోని శాంతినగర్ కాలనీలో గల స్టెమ్‌స్పార్క్ జూనియర్ కళాశాల విద్యార్థులు 2026 ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచారని కళాశాల యాజమాన్యం తెలిపింది. కళాశాల డైరెక్టర్ కొండా సుధాకర్‌రావు వెల్లడించిన వివరాల ప్రకారం, ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఎం. లక్ష్మీచంద్, సీహెచ్. హన్సి, జి. గణేశ్, కె. గాయత్రి తనుష్, ఎన్. సాలిక్యలు తలా 468 మార్కులు సాధించారు. వి. ప్రతిభ, డి. మనోజ్, జి. ధనుష్‌కుమార్, పి. లక్ష్మీ శరత్‌చంద్, ఎస్‌కే. మహ్మద్ యాసిన్, పి. శాశ్వలు తలా 467 మార్కులు పొందారు. డి. భావ్య, సీహెచ్. వెంకటసాయి సాత్విక్, డి. అనిల్, జి. గాయత్రి, జి. ఆకాశ్‌రెడ్డి, బి. విశాలాక్షిలు తలా 466 మార్కులు సాధించారు. కేవలం 100 మంది విద్యార్థులతో నిర్వహిస్తున్న కళాశాలలో 45 మంది 460కి పైగా మార్కులు, 70 మంది 450కి పైగా మార్కులు, 98 మంది 400కి పైగా మార్కులు సాధించడం విశేషమని తెలిపారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించాలనే లక్ష్యంతో స్థాపించిన కళాశాల సాధారణ విద్యార్థులను కూడా ఉత్తమ ఫలితాల దిశగా తీర్చిదిద్దుతోందని పేర్కొన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్, జేఈఈ మెయిన్స్, ఈఏఎంసెట్ వంటి పోటీ పరీక్షల్లోనూ తమ విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారని తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. ఈ సందర్భంగా స్పార్క్ డైరెక్టర్లు కొండా సుధాకర్‌రావు, కొండా కృష్ణవేణి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.



## తల్లిదండ్రులు,ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి

**నేరేడుచర్ల (జనంసాక్షి)**
ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేరేడుచర్ల ప్రధానోపాధ్యాయులు బట్టు మధు నేతృత్వంలో ఉపాధ్యాయ బృందం పురపాలక పరిధిలోని ఆవాస ప్రాంతాల్లో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించింది.పాఠశాల కరపత్రాలను పంపిణీ చేస్తూ తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తున్న విద్యా అవకాశాలు, సౌకర్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ 07 వార్డు కౌన్సిలర్ వాసా జ్యోతి పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనాల కోసం నిర్వహించిన ప్రతిభా పరీక్షల ఫలితాల్లో పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు మెరిట్ సాధించి ఎంపికవడం ఆనందదాయకమని, ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధనతో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు అలాగే విద్యార్థుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ వసతులు,సదుపాయాలను సద్వినియోగం చేసుకునేందుకు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. అనంతరం నూతన ప్రవేశాలను ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు అందించి వారిని, తల్లిదండ్రులను ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు చిత్రం విశ్వనాథ్, ఉపాధ్యాయులు ఎం. సైదులు ఎం జానకి రాములు, ఎన్ నరసింహారావు, వై జానయ్య, పోలిశెట్టి శ్రీధర్, లాల్ సాహెబ్, పి. శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం

**భద్రాచలం జూన్ 11 (జనంసాక్షి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి వారి ఆలయంలో గురువారం స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణతో, మంగళ వాయిద్యాలు నడుమ స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా శాస్త్రోక్తంగా వేద పండితులు నిర్వహించారు. విశ్వక్సేనార్చన, పుణ్యహా వచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు. వచ్చిన భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి పులకించిపోయారు.

## బొడ్రాయి వార్షికోత్సవం సందర్భంగా గ్రామ దేవతలకు బోనాల సమర్పణ

**పి.ఏ.పల్లి,జూన్ 11(జనంసాక్షి):**
పి.ఏ.పల్లి మండల కేంద్రంలో బొడ్రాయి వార్షికోత్సవ సందర్భంగా గ్రామ దేవతలకు గ్రామస్తులు బోనాలు సమర్పించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వంగాల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో బొడ్రాయి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని గ్రామ ప్రజలకు సూచించారు. పి.ఏ.పల్లి గ్రామంలో ఉన్న గ్రామ దేవతలు అయినటువంట ముత్యాలమ్మ,ఈదమ్మ, సవారు లచ్చమ్మ తల్లి దేవతలకు బోనాలు సమర్పించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ పాల్వాయి వెంకట్ రెడ్డి,పి.ఏ.పల్లి సర్పంచ్ వంగాల శ్రీనివాస్ రెడ్డి,ఉప సర్పంచ్ కట్టెబోయిన వెంకటయ్య,వార్డు సభ్యులు బిక్షమయ్య, ప్రసాదు, చైతన్య,పార్టీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి,కోట కోటి,గణపురం వెంకటేశ్వర్లు, గణపురం జనార్ధన్,జెల్ల బుచ్చయ్య,శంకర్, సైదయ్య, నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## భీమనపల్లిలో ఆయిల్ పామ్ గెలల కోత ప్రారంభం

**భూదాన్ పోచంపల్లి, జూన్ 11 (జనం సాక్షి):**
మండలంలోని భీమనపల్లి గ్రామానికి చెందిన రైతు కొత్త పర్వత్ రెడ్డి సాగు చేస్తున్న 14 ఎకరాల ఆయిల్ పామ్ తోటలో గురువారం ఆయిల్ పామ్ గెలల కోత కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ జిల్లా ఇన్‌చార్జి ప్రవీణ్ రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి కవిత, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ శిరీష, ఉద్యాన విస్తరణ అధికారి హరీష్, నరసింహ పాల్గొని ఆయిల్ పామ్ సాగు ప్రాధాన్యత, రైతులకు లభించే ప్రయోజనాలపై వివరించారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్నాటి వరలక్ష్మి పాండు, ఉపసర్పంచ్ గంగాదేవి గురవయ్య, కొత్త ముత్యం రెడ్డి, జగన్ రెడ్డి, యాట కైలాసం, వడ్డమోని వెంకటేష్, సిలువేరు నరసింహ, సింగం పెద్ద సాయిలు, గంగాదేవి రవి, చెక్క శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి భువనగిరి జిల్లా టీపీసీసీ ఆధ్వర్యంలో BLAలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం

**యాదగిరిగుట్ట జూన్ 11 (జనంసాక్షి)**
యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు నమోదు కావడం, అనర్హుల పేర్ల తొలగింపు, వివరాల సవరణ వంటి అంశాలపై బీఎల్ఏలకు సమగ్ర అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి మరియు తెలంగాణ ఇన్‌చార్జి సచిన్ సావంత్, మహిళా కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఓటర్ల జాబితా ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని పేర్కొన్నారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, పేరు లేదా ఇతర వివరాల్లో ఉన్న తప్పులను సరిచేయించే ప్రక్రియలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.అలాగే, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని తెలిపారు. పార్టీ శ్రేణులు, బీఎల్ఏలు



సమన్వయంతో పనిచేసి ప్రజలకు అవగాహన కల్పించాలని, ఓటు హక్కు వినియోగంపై ప్రతి కుటుంబానికి సమాచారం చేరవేయాలని సూచించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు జిల్లా, మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, బీఎల్ఏలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శిక్షణ అనంతరం ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన సందేహాలను నాయకులు నివృత్తి చేసి, కార్యాచరణపై మార్గనిర్దేశం చేశారు.



## కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ బిర్ల అయిలయ్య

**యాదగిరిగుట్ట జూన్ 11 (జనంసాక్షి)**
యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు నియోజకవర్గం పరిధిలోని ఎనిమిది మండలాలకు చెందిన కళ్యాణ లక్ష్మి పథకం లబ్ధిదారులకు



చెక్కులను పంపిణీ చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య. యాదగిరిగుట్ట పట్టణంలోని తన కార్యాలయం వద్ద లబ్ధిదారులకు స్వయంగా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అమలు చేస్తున్న పథకాలలో కళ్యాణ లక్ష్మి ఒక ముఖ్యమైన పథకమని తెలిపారు. ఈ పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు కుమార్తెల వివాహ సమయంలో ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తూ భరోసా కల్పిస్తున్నదని చెప్పారు.అలాగే ఆలేరు నియోజకవర్గంలో అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలు సమన్వయంతో కొనసాగుతున్నాయని, ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, మహిళా లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.